కృష్ణా ఎక్స్‌ప్రెస్సులో దిగింది విమల.

సికిందరాబాద్ రైల్వేస్టేషన్ మహా రద్దీగా వుంది. విమలకి భాగ్యనగరం కొత్త. అందుకే భయం భయంగా దిగి స్నేహితురాలు జలజ కోసం వళ్ళంతా కళ్ళు చేసుకుని చూసింది. అయిదూ పది నిమిషాలు అయిపోయింది. అందరూ వెళ్ళిపోతున్నారు. చాలామంది వెళ్ళిపోయారు కూడా.




జలజ ఇంటి అడ్రెస్ దగ్గర వుంది. ఎలా వెళ్ళాలో కూడా వాళ్ళ నాన్న ప్లాన్ వేసి చూపాడు కూడా. తను వస్తున్నట్లుగా వుత్తరం రాస్తే జలజ స్టేషనుకి రాకుండా వుంటుందని అనుకోలేదు. తనకి పిచ్చి భయంగానే ఇదే మన్నా ఫారెనా! తెలుగు దేశం. ఛీ భయపడకూడదు అనుకుని తనకి తనే ధైర్యం చెప్పుకుని స్టేషన్ బయటికి వచ్చేసింది విమల.

'ఆటో' పెద్ద తెల్సినదానిలా ఆటోని పిల్చి సూట్‌కేస్ లోపల పెట్టుకుని కూర్చుని జలజ అడ్రెస్ చెప్పింది. ఆటో అతను మాట్లాడకుండా ఆటోని పోనిస్తున్నాడు. జలజని నాలుగూ దులిపెయ్యాలి అన్న కోపంతో కూర్చుంది. ఆటో వేగంగా వెడుతూ వుంది. విమల ఆలోచనలూ అంతకంటే వేగంగా వెనక్కి వెళ్లాయి. జలజా విమలా చిన్నప్పటి స్నేహితులు. ఇద్దరూ హైస్కూలు చదువు ముగించారు. విమలని తండ్రి కాలేజీలో చేర్పించాలని ప్రయత్నిస్తూంటే అతి సామాన్యుడైన జలజ తండ్రి ఇంక నేను చెప్పించలేను అనటంతో జలజ విమల దగ్గరకి వచ్చి భోరుమంది. విమలకే కాక విమల తల్లిదండ్రులకి కూడా జలజ అంటే అభిమానం. అందుకే ఆ అమ్మా

యిని ఓదార్చటమేకాక "ఇద్దరూ కల్సి చదువుకుంటారుగా. బుక్స్ కల్సివస్తాయి ఇంక జీతం విషయం నే కొంత సాయం చేస్తానులే" అని ధైర్యం చెప్పి జలజనీ కాలేజీలో జాయిన్ చేశారు. దాదాపు డిగ్రీ చదువు అయేవరకూ ఆయన తన మాట నిలబెట్టుకున్నారు. అయితే కాలేజీలో చేరిన తర్వాత జలజలో ఏదో తెలియని మార్పు రాసాగింది. విమల అంటే అసూయపడటం ప్రారంభించింది. ఈ భావం బైటపడకుండా చాలా జాగ్రత్తగా వుండాలని ప్రయత్నిస్తోంది. విమల అసలు ఇదేమి పట్టించుకోని అమాయకురాలు. జలజని అభిమానించడం మాత్రమే తెల్సు. సహజంగా విమల అందంగా వుంటుంది. అందులోనూ తండ్రికి మంచి వుద్యోగం కావటంవల్ల మంచి బట్టలూ అవీ వేసుకుని చూసేవాళ్ళని ఇట్టే ఆకర్షించేది.

అబ్బాయిలు విమల అంటే పడి చచ్చే వాళ్ళు. కానీ విమల అదేం పట్టించుకునేది కాదు. తన చదువూ ఇల్లూ స్నేహితురాలు జలజా. ఇదే ప్రపంచం. ఇద్దరూ ఇలా చదివి బి.ఏ., పాస్ అయారు. జలజ అన్నగారు భాగ్యనగరంలో వుండటంతో సిటీకి వచ్చి వుద్యోగం చేస్తూ ఎం.ఏ., పాస్ అయింది. లెక్చరర్ వుద్యోగం సంపాదించుకుంది. విమల తండ్రి పోవ టంతో సంసార పరిస్థితి తారుమారై చదువు ఆపేసి ఖాళీగా వుండిపోయింది. తల్లి పెళ్ళిప్రయత్నం చేస్తూంది. కానీ ఒక్కటీ కల్సిరాలేదు. విమల గాభరా పడి పోయింది. ఇటు చదువూ లేదు, అటు వుద్యోగమూ లేదు. పోనీ పెళ్ళి కల్సి రావటంలేదు. ఎన్నాళ్ళని వచ్చిపోయే పెళ్ళి కొడుకుల ఎదుట ప్రాణంలేని బొమ్మలా కూర్చుంటుంది. కట్నాలు ఇవ్వలేని తన కూతురికి పెళ్ళి అవదా! అని దిగులు పడింది విమల తల్లి. విమల ఆలోచించి జలజకి వుత్తరం రాసింది. "నే వచ్చేస్తూ న్నాను నీ దగ్గరికి. ఓ చిన్న వుద్యోగం చూపిపెట్టు" అని.

జవాబుకోసం చాలారోజులు ఎదురు చూసి విసిగి తనే బయలుదేరి వస్తూ ఫలానా రైల్లో వస్తూన్నా అని రాసింది. అయినా స్టేషనుకి రాలేదు జలజ.

"నా వుత్తరాలు అందలేదా! ఒకవేళ ఇల్లు మారివుంటారా! అలా జరిగితే నేనేం చేయాలి."ఎన్నెన్నో ఆలోచనతో సతమత మౌతుంది విమల.

ఇల్లు తెల్సుకోవటం కాస్త కష్టమైనా మొత్తానికి దొరికింది. 'అమ్మయ్య' కొండంత ధైర్యం వచ్చేసింది విమలకి. జలజ ఎం.ఏ., అన్న బోర్డు చూసేసరికి ఆటో మీటర్ చూసి డబ్బు ఇచ్చేసి సూట్ కేస్ తీసుకుని మూసి వున్న తలుపు తట్టింది. చెదిరిపోయిన జుత్తు సరిచేసు కుంటూ కర్చిఫ్‌తో ముఖాన పట్టిన చెమట తుడుచుకుంటూ.

రెండు నిమిషాల్లోనే తలుపు తెరుచు కుంది. ఎదురుగా లావుగా పొట్టిగా వున్న ముప్పైఏళ్ళ యువకుడు నిల్చొని 'ఎవరి కోసం' అన్నట్లుగా చూశాడు. విమలనీ విమల చేతిలోవున్న సూట్‌కేస్‌నీ.

"నాకూ.... నాకు ... జలజ కావాలి!' జలజ భర్త కాబోలు అనుకుంటూ.

వెళ్ళింది. మూడింటికి కానీ రాదు. అన్నట్టు

## సుభాషితాలు

సాటి మానవుల కష్టాన్ని ఏ మేరకు తొలగించగలిగినా ఆ మేరకు ఆ వ్యక్తి ఘనవిజయాన్ని సాధించినట్టే. —మహాత్ముని సూక్తి




మీరు ”

“నేనూ నేను జలజ ఫ్రెండ్ విమలని నేవస్తూన్నట్లుగా వుత్తరం కూడా రాశానే ”

‘‘అలాగా! రండిలోపలికి గోవిందూ ఇలారా” కేకపెడుతూ పక్కకి తప్పు కున్నాడు విమలకి యేంచేయాలో తోచలేదు. బైట యెండ మాడ్చేస్తోంది అది భరించలేక లోపలికి వచ్చేసింది. నౌకరు కుర్రాడు వచ్చి సూట్ కేస్ అందు కున్నాడు ‘రండమ్మా’ అంటూ పిల్చాడు యజమాని ముఖంలోకి చూసి అర్ధమై నట్లుగా తలవూపుతూ.

“ముందు మంచినీళ్ళుఇచ్చి కాఫీఇవ్వు తర్వాత స్నానం భోజనంచూడు” అతను మర్యాదచేస్తూన్నందుకు తృప్తిగా వుంది కానీ కొత్తకావటంవల్ల చాలా బెరుగ్గా వుంది. గోవిందు అయిదునిమిషాల్లోనే వేడి కాఫీతెచ్చి యిచ్చాడు విమల కాఫీ తాగుతూ ఇల్లు అంతా పరీక్షగా చూసింది.

ఇల్లు అంతా నీట్‌గా సర్దివుంది సోఫాలో కిటికీలకీ దర్వాజాలకీ తెరలూ వగైరా చూస్తే జలజ ఆడంబరంగానే బ్రతకగల్గుతోంది అన్పిస్తోంది ఈయనకి యేం వుద్యోగమో తెలియదు. జలజ ఇతని వివరాలు తెల్పలేదు బహుశా పెద్ద వుద్యోగమే అయివుండచ్చు

ఆలోచనల్లోనే స్నానంచేసింది. కాస్త హాయిగా అన్పిస్తోంది.

“అమ్మా భోజనం వడ్డించాను”విమల

భోజనం చేస్తూండగా జలజ భర్త శంకర్ కర్టెన్ తప్పించుకుంటూ వచ్చి.

"మీరు భోజనం చేసి విశ్రాంతి తీసుకోండి జలజకి ఫోన్‌చేశాను త్వరగా వచ్చేస్తుంది నాకు అర్జెంట్‌పని వుంది. బైటకి వెళ్లాలి మీకు యేంకావాలన్నా గోవిందు వుంటాడు.''

'సరే'అన్నట్లుగా తలవూపింది విమల అతని మర్యాదకి మాత్రం చాలా తృప్తి పడింది పరిచయం లేకున్నా గౌరవించినందుకు శంకర్ వెళ్ళిపోయాడు అందగాడు కాకపోవచ్చు కానీ మంచివాడులా వున్నాడు జలజ అదృష్టవంతురాలు అనుకుంది

గోవిందు వీధితలుపు వేసి లోపలికి వచ్చాడు విమల భోజనం కాగానే ఓ గది చూపించి "పెట్టె అక్కడ పెట్టాను ఏంకావాలన్నా పిలవండి"అంటూ హాలులోకి వెళ్ళి యేదో పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు పధ్నాలుగేళ్ళ గోవిందు. విమలకి చాలా అలసటగా వుంది నిద్రముంచుకు వస్తోంది ఆ గది అంతా పరీక్షగా చూసింది ఓ మంచం దానిమీద తెల్ల దుప్పటీ రెండు దిళ్ళూ చిన్న టేబిలూ ఓ రెండు కుర్చీలూ బట్టల స్టాండు వున్నాయి అంతే.

మంచంమీద కూర్చుని ఆలోచిస్తోంది జలజ లేకుండానే దాని ఇంట్లో ఇలా వచ్చి కూర్చుంటానని ఎప్పుడూ అనుకోలేదు ఇంక అది ఎలావుందో! చాలా మార్పు వుండివుంటుంది! నేనిలా వచ్చేయటం మంచిదా! చెడ్డదా! ఏమో! సరే' వచ్చేశాను ఇంక ఆలోచించటం అనవసరం అనుకుని దిండు మీదవాలింది విమల. ఆ గదిలో గోడకి జలజ చిన్నప్పటి ఫోటో ఒకటి తగిలించి వున్నది చూస్తూ అలాగే పడుకుంది విమల

తెలియకుండానే నిద్రముంచుకు వచ్చేసింది.

## 2

"ఏవ' మొద్దు! లే " అన్న జలజ పిలుపుకిగానీ మెలుకువ రాలేదు విమలకి. కళ్ళు తెరిచి జలజని చూసి గభాలున లేచి కూర్చుంది

"ఎంతసేపైంది వచ్చి "

"పావుగంటపైన అయింది. కుంభకర్ణుడి చెల్లెలులా నిద్రపోతున్నావు' పాపం లేపటం ఎందుకులే అనుకున్నాను కానీ ఈ వెధవ మనస్సు వుంది చూశావూ ఇది ఆగదే!" అంటూ మంచంమీద విమలని ఆనుకుని కూర్చుని కబుర్లు చెప్తున్న జలజని రెప్పవాల్చకుండా చూస్తోంది విమల.

చదువుకునే రోజులకంటే ఇప్పుడు కాస్త లావు అయింది ఖరీదైన బట్టలు వేసుకుంది చేతులకి నాలుగు జతల బంగారు గాజులూ మెడలో ముత్యాల హారం, చెవులకి పెద్దవిగా వున్న కమ్మలూ వగైరా ఆమె స్థితిని చెప్పక చెప్తూన్నాయి

'ఏయ్ గోవిందూ వేడి టీ పట్టుకురా!' అని కేకపెట్టి ఇటుతిరిగి "విమలా అరె వుత్తరమైనా రాయకుండా ఇలా వూడిపడ్డావేమిటీ" అంది.

'ఒకటి కాదు రెండు వుత్తరాలు రాశాను' చిరుకోపంగా అంది విమల.

"ఏవీ!"

"అందలేదా."

" 'అబద్ధం చెప్తానా!' విమలా నువ్వు కొ_త్తన్నా మారినట్లు లేవుకదూ."

విమల పేలవంగా నవ్వింది. "ఉండు బట్టలు మార్చుకు వస్తాను" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది జలజ విమల అలాగే మంచంమీద కూర్చుంది దిక్కులు చూస్తూ. జలజ ముస్తాబు ముగించు కుంటూనే కేకపెట్టింది.

"విమలా ముఖం కడుక్కుని బట్టలు మార్చుకో. అలా బైటకి వెళ్ళివద్దాం."

విమలకి బద్ధకంగా వున్నా లేచింది. జలజలో తను ఆశించినంత ఆత్మీయత కన్పించటంలేదు ఎందుచేతనో విమల మనస్సు అదోలా అయిపోతూన్నా ఛీ నేను తప్పుగా ఆలోచిస్తూన్నానేమో! అనుకుని గబగబా తయారయింది. జలజ భర్త మళ్ళీ కన్పించలేదు. రెండురోజులు సిటీ అంతా తిప్పి చూపించి ఆఖరుకి అంది

"విమలా నాకింక లీవులేదు కాలేజీ వుంటే అస్సలు తీరుబడి వుండదు "

ఈ రెండురోజుల్లోనూ విమల తను వచ్చిన విషయం చెప్పాలని ప్రయత్నించింది. కానీ జలజ సంభాషణ మార్చేస్తూ విమలకి అవకాశం ఇవ్వలేదు.

విమల ఇంక లాభంలేదని యిప్పుడు చెప్పింది

"నాకో చిన్న వుద్యోగం కావాలి జలజా. నీ దగ్గర వుండి యీ వూళ్ళో ఎక్కడన్నా ప్రయత్నిస్తాను. నాకు వుద్యోగం చాలా అవసరం "

పారం అప్పగించినట్లు గబగబా అనేసింది.

"నీకా! వుద్యోగమా! కావాలా!"

"ఔను. నేను నా కాళ్ళమీద నిలవాలి. ఆపైన మా అమ్మకి సాయంచేయాలి. ఇలాంటి పరిస్థితి వచ్చింది ఇంక వివరాలు చెప్పలేను "

"నీకెవరు తెల్సునని ప్రయత్నిస్తావు?"

"ఎవ్వరూ లేరు నువ్వు తప్ప "

జలజ పెద్దగా నవ్వేసింది. "అలా అన్నావు బాగుంది నే నిప్పిస్తాను ఉద్యోగం "

"నిజంగా "

"అక్షరాలా "

"ఎక్కడ?"

"మా శ్రీవారు పనిచేసే కంపెనీలో! అప్లికేషన్ ఇచ్చి నువ్వు నిశ్చింతగా ఇంటికి వెళ్ళిపో! ఆర్డర్సు పంపిస్తాం "

"నన్ను చూడకుండానే ఇస్తారా! అదెలా సాధ్యం?"

"అవన్నీ నీకనవసరం నువు నిశ్చింతగా వెళ్ళిపో."

జలజ ఇస్తూన్న భరోసాకి విమలకి సంతోషంతో కన్నీళ్ళు తిరిగాయి

"జలజా' నాకీ సాయం చేశావంటే నీకు చాలా రుణపడి వుంటాను "

"అంత పెద్దమాటలు వద్దులే "

"అదికాదు ఆర్థిక యిబ్బందులువల్ల ఒకటికి రెండుసార్లు యీ వూరుకి రాలేను కూడా. అందుకు చెప్తూన్నాను "

"మరేం ఫర్లేదు అంత అవసరం రానీయనుగా "

'సరే' నిశ్చింతగా నిద్రపోయింది విమల.

## 3

ఊరికి బయలుదేరి మరోసారి జలజని హెచ్చరించి మరీ ఆటో ఎక్కింది విమల బస్‌కిటికెట్ రిజర్వేషన్ అంత టైములేక క్యూలో నిల్చుంది టికెట్ కోసం క్యూ చాలా పొడుగ్గా వుంది పెట్టి బరువుకి చెయ్యి లాగుతోంది అసలే విసుగ్గా వుంది. టికెట్లు ఇవ్వటం మొదలుపెట్టారు విమల మెల్లగా నడుస్తోంది

'అరె! విమలా! నువ్వా! ఈ వూరు యెందుకు వచ్చావ్!' పరిచయమైన గొంతువిని తలతిప్పి చూసింది చిన్నప్పటి స్నేహితురాలు అరవింద తమ్ముడు పదహారేళ్ళ శ్యామలరావు పల్కరించడం చూసి "అరె! నువ్వీ వూళ్ళో వున్నావా!" అంది ఆశ్చర్యంగా చూస్తూ శ్యామలరావు అరవిందతోబాటు విమలనీ అక్కా అని పిలిచేవాడు ఆత్మీయంగా వుండేవాడు

"అక్కకి పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళిందిగా మా నాన్నారికి యీ వూరు బదిలీ అయింది ఇక్కడే వుంటూన్నాం. అన్నట్లు నీకు తెలియదుకదూ! సరేగానీ ఈ వూరు ఎందుకు వచ్చినట్లు!"

విమల తల్లిదండ్రులకీ అరవింద తల్లిదండ్రులకీ చాలాసంవత్సరాల స్నేహితం. ఇరుగుపొరుగున వుండేవాళ్ళు ఒకరంటే ఒకరు ప్రాణం ఇచ్చేంత సన్నిహితంగా వుండేవారు. విమలా అరవిందా మరీ కల్సి వుండేవాళ్ళు అరవింద తండ్రికి ఆ వూరు నించి బదిలీ కావటంతో ఇరుకుటుంబాల వారూ చాలా బాధపడిపోయారు అరవింద చాలారోజులు వుత్తరాలు రాస్తూ క్షేమం తెల్పుతూ వుండేది రానురాను అవి కాస్త తగ్గాయి. అరవిందకి పెళ్ళి అయిపోయిందని తెల్సుకూడా విమలకి.

శ్యామలరావు చాలా పెద్దవాడిలా అయిపోయాడు అనుకుంటూ అతన్ని పరీక్షగా చూస్తూ 'ఏం చదువుతున్నావ్!' అంది.

'బీయస్సీ' కానీ ముందా క్యూలోనించి ఇవతలకి రా అమ్మా నాన్నా దగ్గరకి వెడదాం' అంటూ విమల వద్దు అంటూన్నా బలవంతపెట్టి ఆటో పిల్చాడు

అరవింద తలిదండ్రులు విమలనిచూసి చాలా సంతోషపడిపోయారు శ్యామలరావు ఓ స్నేహితుడిని పంపటానికి బస్ స్టాప్‌కి వెళ్ళడంవల్ల నువ్వు కన్పించడం గమ్మత్తుగా జరిగింది కదూ. అంటూ విమల కుటుంబ విషయాలు తెల్సుకుని విచారపడ్డారు.

"నీకు వుద్యోగం కావాలంటే మరి వూరికి వెళ్ళకు మేం వున్నాంగా" అని బలవంతం చేసి ఆపేశారు.

"అక్కా! అలా సినీమాకి పోదాం. షికారు పోదాం" అంటూ శ్యామలరావు స్వంత అక్కని చూసినంతగా సంబరపడిపోతూ విమలని తిప్పుతూన్నాడు.

శ్యామల తండ్రి 'నేనూ చూస్తానమ్మా' అంటూ ప్రయత్నం ప్రారంభించాడు.

వారంరోజులు ఇట్టే గడిచిపోయింది. జలజ ఇంటికి వెళ్ళి వూరు వెళ్ళలేదు అని చెప్పాలని ప్రయత్నించింది కానీ వీలు కాలేదు

శ్యామలరావు తండ్రి ఒకరోజు అన్నాడు "నీ ఫ్రెంచ్ ఏం చేసిందో తెల్సుకో " అని

విమల జలజ ఇంటికి బయలుదేరింది. జలజ ఇంట్లో నౌకరుతప్ప మరెవరూలేరు. అలవాటు అయిన ఇల్లు కావటంవల్ల సరా

సరి లోపలికి వెళ్ళి కూర్చుంటూ "మీ అమ్మగారు ఎప్పుడు వస్తారు ఇంటికి గోవిందూ" అడిగింది.

"సాయంకాలం సినీమాకి వెళ్ళిగానీ రామన్నారు"

"అలాగా! సరే మళ్ళీ వస్తానులే. నేను వూరికి వెళ్ళలేదు అని చెప్పు మీ అమ్మగారు అన్నట్లు నా జాకెట్ ఒకటి ఇక్కడ మార్చిపోయాను వున్నదా"

'వుంది' తెచ్చియిచ్చాడు.

"గోవిందూ ఓ కాయితం ఇవ్వు ఇది కట్టి తీసుకుపోతాను"

గోవిందు కాయితం పట్టుకువచ్చాడు. తను కుంపటి వెలిగించుకునేందుకు వుంచుకున్న కాయితాల్లోంచి మంచిది ఏరి మరీ పట్టుకువచ్చాడు

జాకెట్ చుట్టేయబోతూ తన సంతకం కన్పించి ఆశ్చర్యపోయి కాయితం పరీక్షగా చూసింది ఆశ్చర్యపోయింది. ఇది ఇది గోవిందు వాడుకునే చిత్తు కాయితాల్లోకి యెలా వచ్చిందీ! నిర్ఘాంతపోయి అలాగే కూర్చుంది. ఇంతలో జలజ భర్త వచ్చాడు. విమలని చూసి ఆశ్చర్యపోయి "అరె! మీరు వూరువెళ్లారని చెప్పింది జలజ? యెప్పుడొచ్చారు మళ్ళీ."

"వెళ్ళాలనుకున్నాను కానీ వెళ్ళలేదు" నీరసంగా ఇచ్చింది జవాబు

"మరి మీ మేరేజ్ సెటిల్ అయిపోయిందని చెప్పింది జలజ"

"అలాగా?" మరీతెల్లబోయింది విమల

"గోవిందూ రెండు కప్పులు వేడి కాఫీ పట్టుకురా" అంటూన్న అతన్ని వారిస్తూ "వద్దండీ! నేను మరోసారి వస్తాను అలా చెప్పండి జలజకి" అంటూ లేచింది.

"అహ కూర్చోండి. కనీసం కాఫీ అయినా తాగి వెళ్ళండి"

విమల ఏం జవాబు చెప్పలేక కూర్చుండిపోయింది. జలజ భర్త బట్టలు మార్చుకుని లుంగీ కట్టుకుని వచ్చి డైనింగ్ టేబిల్ ముందు కూర్చుంటూ అలసటగా వున్న ముఖాన్ని పైమీది తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ ఇంక తన ఆఫీసు కబుర్లు చెప్తూ "అబ్బ! ఇవాళ కొన్ని ఇంటర్వ్యూలు జరిగాయి నాలుగు ఖాళీలకి నలభైమంది కాదు నాలుగు వందలమంది వస్తున్నారు పాపం నిరుద్యోగ సమస్య యెప్పటికి సమసిపోతుందో అర్థంకాకుండా వుంది. అరె! మీకు బోర్ కొట్టే విషయాలు చెప్తున్నాను కదూ!" అంటూ నౌకరు తెచ్చిన కాఫీ తాగేసి కప్పు టేబిల్ మీద పెట్టేసి కాఫీ ఇంకా తాగకుండా అలాగే కూర్చున్న విమలని పరీక్షగా చూస్తూ.

"అరె! అలా వున్నారేం అవునూ నా ప్రశ్నకి జవాబు ఇవ్వలేదు. కంగ్రాజులేషన్స్ చెప్పినా"

"చూడండి నా పెళ్ళి సెటిల్ కాలేదు. నేను యెంత చిన్నదైనా సరే ఒక ఉద్యోగ ప్రయత్నం చేసుకునేందుకు యీ వూరు వచ్చాను ఇంతే మరి వెళ్ళివస్తాను"

"ఆ అలాగా!" అతను ఆశ్చర్యం నుంచి తేరుకోకుండానే ఇవతలకి వచ్చేసింది విమల.

"అడ్రెస్ ఇవ్వండి జలజ మిమ్మల్ని కల్సుకుంటుందేమో"

వాకిలివరకూ వచ్చి అన్నాడు శంకర్.

"అక్కరలేదు కావాలంటే నేనే

కలుస్తాను" అనేసి చకచకా అడుగులు లేసింది.

ఇల్లు యెలా చేరిందో విమలకే తెలియదు. వస్తూనే వాలుకుర్చీలో వాలి పోయి కళ్లు మూసుకుంది. జలజ ఇలా యెందుకు చేసింది! అన్న ప్రశ్నకి జవాబు దొరకకపోగా ఆవేదన, ఉక్రోషం, కోపం, దుఃఖం ఒకేసారి వచ్చి వుక్కిరి బిక్కిరి చేసేశాయి రెండు చేతుల్లోనూ ముఖం దాచేసుకుని వుండి పోయింది.

'అరె అక్కాయేమైంది' శ్యామల రావు ఆదుర్దాగా అడిగాడు

విమల చెప్పిందంతా విని నవ్వేస్తూ "ఛా యింత చిన్న విషయానికి అంత బాధపడాలా! పోనివ్వు నాన్నారు ప్రయత్ని స్తారు నీకు వుద్యోగం వచ్చి తీరుతుంది"

విమలకి శ్యామలరావు మాట విన్పించ టం లేదు వెక్కి వెక్కి యేడ్చేసింది.

"నమ్మించి ఇలా మోసం యెందుకు చెయ్యాలి, 'కాదు' అని చెప్పినా నా కింత బాధ కల్గదు"

"అబ్బబ్బా ఇంక ఆ విషయం వదులు పద సినీమాకిపోదాం. నీ మనస్సుకి కాస్త శాంతి కల్గుతుంది" అని బలవంతంగా తీసుకు వెళ్ళాడు.

అప్పటికే పిక్చర్ ప్రారంభమైంది టికెట్లు కొనుక్కుని ఇద్దరూ లోపలికి వెళ్ళి కూర్చున్నారు శ్యామలరావు సినీమా చూడడంలో మునిగిపోయాడు కానీ విమల మనస్సు మనస్సులో లేదు

ఇంట్రవెల్‌లో లైట్లు వెలిగాయి. ముందు వరుసలో కూర్చున్న జలజ కోకోకోలా వాడిని కేకవేస్తూ విమలని చూసింది విమలా అప్పుడే జలజని చూసి గుర్తించింది.

"అరె! విమలా!" అంటూ లేచి వచ్చి ఖాళీగా వున్న కుర్చీలో కూర్చుని కబుర్లు చెప్పేస్తోంది.

"నీ అప్లికేషన్ మావారు తన బాస్‌కి ఇచ్చారు నీకు తప్పకుండా వుద్యోగం వస్తుంది. ఆర్డర్స్ త్వరలోనే వస్తాయి. యింతకీ "


విమల నోట్లోనించి ఒక్కమాటా బైటకి రావటంలేదు. ఆవేశంతో ముఖం జేవురించిపోయింది. ఇది గ్రహించిన శ్యామలరావు తనే జవాబు చెప్పాడు తను బస్‌స్టాండ్‌లో కల్సి యింటికి తీసుకు వచ్చినట్లుగా అంతా చెప్పి "విమలక్కకి వెళ్ళి సెటిల్ అయిందిగా వుద్యోగం. అక్కర్లేదు"

జలజ ముఖం నల్లగా మాడిపోయింది "అలాగా" అంది యెలాగో తిరిగి పిక్చర్ ప్రారంభం కావటంలో వెళ్ళి తన సీట్లో కూర్చుంది. పిక్చర్ పూర్తి అవుతూండ గానే విమల శ్యామలరావు చెయ్యిపట్టు కుని హాలుబైటకి తీసుకువచ్చేసి "పద పోదాం" అంది అంటే ఇద్దరూ ఇల్లు చేరారు

## 4

రెండు నెలల తర్వాత విమలకి నూట పాతిక రూపాయిల వుద్యోగం దొరికింది. మూడు బస్సులు మారి వెళ్ళటం చాలా ప్రయాసగా వున్నా విమల ఉద్యోగం వదులుకోలేదు శ్యామలరావు తల్లి దండ్రులు విమలని యెంతో ఆత్మీయంగా చూసుకుంటూన్నారు, యీ అభిమానానికి

—అరవిందయోగి




కృతజ్ఞత మాటల్లో చెప్పలేకపోతోంది

తల్లి ఆరోగ్యం బాగులేదని వచ్చిన వుత్తరం చూసుకుని శలవుపెట్టి వెళ్ళేసరికి ఆమె యీ లోకాన్నే వదిలిపోయింది. వెంటనే తిరిగి రాలేకపోవటంలో యీ చిన్న వుద్యోగమూ వూడిపోయింది. విమల శోకదేవతే అయింది శ్యామలరావు ధైర్యం నూరిపోశాడు. మరో వుద్యోగం దొరికింది అలా కాలం దొర్లిస్తూండగా సూర్యారావుతో పెళ్ళి జరిగిపోయింది. ఇద్దరూ వుద్యోగాలు చేసుకుంటూ ఇంటికి కావల్సిన వస్తువులని అమర్చుకున్నారు. విమల ఇద్దరు పిల్లల తల్లి అయింది. భర్త ఇంక వుద్యోగం మానేసేయి. 'నాకు ప్రమోషన్ వచ్చింది' అన్నప్పుడు తృప్తిగా నిట్టూర్చి వుద్యోగాన్ని వదిలి ఇల్లునీ భర్తనీ పిల్లలనీ ప్రాంప్రదంగా చూసుకుంటూ కాలం వెళ్ళదీస్తోంది

ఒకసారి రైలు ప్రయాణంలో కాలేజీ నాటి ఫ్రెండ్ ఒక అమ్మాయి కన్పించి జలజ వుద్యోగం పోగొట్టుకున్నట్లూ అస్తమానం భర్తని అనుమానించటం వల్ల అతను వేగలేక వదిలేసినట్లూ చెప్పింది

"అయ్యో! అలా ఎందుకు జరిగింది." బాధపడిపోతూ అంది విమల.

"జలజ ఎమ్.ఎ పాసు అయిన తర్వాత చాలా మారిపోయింది. తన ఫ్రెండ్స్ యెవరూ ఎమ్.ఏ చదివి లెక్చరర్ కాకూడదనీ ఆప్రత్యేకత తన ఒక్కదానికే

వుండాలన్న ఆరాటంతో పిచ్చిదానిలా వ్యవహరించేది. అన్నీ అబద్ధాలు చెప్తూ యేదేదో చేసేది. అలా చేయటంతో అందరూ దూరమై ఏకాకి అయింది. చివరికి భర్తకి కూడా యీ ప్రవర్తన నచ్చక వదిలేశాడు అంటూన్నారు.

విమలకి మొదట కోపం వచ్చినా తర్వాత జాలి ముంచుకు వచ్చింది. తర్వాత చాలా రోజులవరకూ జలజ విషయాలు తెలియలేదు విమలకి కానీ యివాళ హఠాత్తుగా జలజ వుత్తరం రాసింది చూసి ఆలోచనలో పడింది జలజవుత్తరం మళ్ళీ మళ్ళీ చదువుకుంది.

"విమలా మనం చిన్ననాటి స్నేహితులం. మీ శ్రీవారితో చెప్పి నాకు కాలేజీలో లెక్చరర్ జాబ్ వచ్చేలా సాయం చెయ్యాలి. మీవారి పలుకుబడి నాకు తెల్సింది. నేనే ఇంటర్వ్యూకి వస్తూన్నాను. నీ ఇంటికే వస్తాను.

జలజ.

విమల ఆ రాత్రి అంతా అశాంతిగా గడిపింది. జరిగినదంతా భర్తకి చెప్పింది. ఆయన నవ్వి నిద్రపోయాడు. జలజ వచ్చింది. వెళ్ళిపోతూ 'నీ వుత్తరంకోసం యెదురు చూస్తూంటాను' అంటూ చెప్పి వెళ్ళిపోయింది.

ఒకరోజు రాత్రి సూర్యారావు చెప్పాడు "విమలా! నీ నెచ్చెలికి ఆర్డర్స్ పంపాలా" అని. విమల రెండు నిమషాలు ఆలోచించి అంది.

"మీ వల్ల అయితే తప్పక సాయం చెయ్యండి."

'గుడ్ ' అంటూ మెచ్చుకోలుగా నవ్వాడు సూర్యారావు. మరుసటిరోజు జలజకి విమల వుత్తరం రాసింది యిలా.

"విమలా

మానవ జీవితం క్షణభంగురమైనది. ఇది తెల్సుకుని 'అంతరాత్మ'ని చంపుకోకుండా బ్రతకటం ప్రతివాళ్ళకీ అవసరం. నాకు అంతరాత్మ వుంది. నీకు చేయగల్గిన సాయం చేశాను.

ఇంతే

విమల.

ఇలా వుత్తరం ముగించి తేలికపడిన మనస్సుతో కుర్చీ వెనక్కి వాలిన భార్య భుజంమీద చెయ్యివేస్తూన్న సూర్యారావుని అప్పటికి చూసింది విమల.

"అరె! ఎప్పుడొచ్చారు. ఎంతసేపయింది వచ్చి. వుండండి వడ్డిస్తాను" అంటూ కుర్చీలోనించి లేస్తూన్న భార్యని ప్రేమగా దగ్గరికి తీసుకుంటూ.

"విమలా నువ్వెంత మంచిదానివి. నీ మనస్సెంత మంచిది. నీలాంటి భార్య దొరకటం నా అదృష్టం." అంటూంటే అతని చేతిని ఇంకాస్త గట్టిగా పట్టుకుంటూ "కాదు...నాది అదృష్టం." అంటూ డైనింగ్ టేబిల్ దగ్గరకి నడిచింది విమల.

